క్లుప్తంగా

వేంకటేశ్వరస్వామికి విశేష పూజలు



పద్మావతి వేంకటేశ్వరస్వామికి తామరపూలతో సహస్రనామార్చన నిర్వహిస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్): దంతులూరి జగన్నాథరాజు సత్రం అనుబంధ సంస్థ పద్మావతీ వేంకటేశ్వర స్వామివారి దేవస్థానంలో శ్రావణ మాసం సందర్భంగా శనివారం స్వామి, అమ్మవార్లకు విశేష పూజలు నిర్వహించారు. సాయంత్రం 6.30 గంటలకు కాకులపాటి వీర రాఘవరావు, ఇంద్రాణి దంపతులచే స్వామి వారికి 1008 తామర పూలతో సహస్రనామార్చన, సహస్ర దీపాలంకరణ పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సత్రం వంశపారంపర్య చైర్మన్ మంతెన రామ్ కుమార్ రాజు, ఈవో ముదునూరి సత్యనారాయణరాజు, అర్చకులు, ఆలయ సిబ్బంది, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

తల్లిపాల విశిష్టతను గుర్తించాలి



ఆకివీడులో తల్లిపాల వారోత్సవాలు నిర్వహిస్తున్న దృశ్యం

ఆకివీడు: మండలంలోని గరటాల గ్రామంలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను శనివారం ఘనంగా నిర్వహించారు. సూపర్‌వైజర్ నాగలక్ష్మి మాట్లాడుతూ తల్లిపాల విశిష్టత గురించి తల్లులకు వివరించారు. తల్లిపాలు బిడ్డ హక్కని బిడ్డకు అదే తొలిటీకా అని తెలిపారు. తల్లిపాలు ఇవ్వడం వల్ల పిల్లలకు దీర్ఘకాలిక వ్యాధులు రాకుండా ఉంటాయని, తల్లిబిడ్డకు అనుబంధం పెరుగుతుందని చెప్పారు. తల్లిపాల వారోత్సవాలను ఆగస్టు 7వ తేదీ వరకు అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు భాను, ఆశవర్కర్లు, ఏఎన్ఎంలు, బాలింతలు తదితరులు పాల్గొన్నారు.

పీవీఎల్ పరామర్శ



సతీష్‌ను పరామర్శిస్తున్న పార్టీ ఇన్‌చార్జి పీవీఎల్, నాయకులు

ఉండి: ఉండి పట్టణ మాజీ అధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు రాయి సతీష్ తండ్రి నూకరాజు అకాల మృతిపై నియోజకవర్గ ఇన్‌చార్జ్ పీవీఎల్ నర్సింహరాజు శనివారం పరామర్శించి నివాళులర్పించారు. నూకరాజు మృతి పార్టీకి తీరనిలోటని అన్నారు. అలాగే రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పాతపాటి శ్రీనివాసరాజు(వాసు) సతీష్ కుటుంబాన్ని పరామర్శించి ధైర్యంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు పీవీఆర్‌కే ఆంజనేయరాజు, జిల్లా గ్రీవెన్స్‌సెల్ అధ్యక్షుడు గలావిల్లి ధనుంజయ, మండల ఉపాధ్యక్షుడు అంగర రాంబాబు, సీనియర్ నాయకుడు కరిమెరక శివనాగరాజు, ఉండి పట్టణ అధ్యక్షుడు కరిమెరక మల్లిఖార్జున తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పింగళి జయంతి



భీమవరంలో పింగళి వెంకయ్య చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశం చౌక్): జాతీయ పతాకం రూపకర్త పింగళి వెంకయ్య దూరదృష్టి జాతీయ భావం చరిత్ర ఉన్నంతకాలం నిలిచిపోతాయని పలువురు వక్తలు తెలిపారు. శనివారం భీమవరం క్విట్ ఇండియా స్థూపం వద్ద జాతీయ పతాకం రూపకర్త పింకాళి వెంకయ్య జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సర్వోదయ మండలి కార్యదర్శి ఇందుకూరి ప్రసాదరాజు, క్విట్ ఇండియా స్థూప పునః నిర్మాణ కమిటి సభ్యులు అరసవల్లి సుబ్రహ్మణ్యం, చెరుకువాడ రంగసాయి, పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్ సత్యనారాయణ రాజు, భట్టిప్రోలు శ్రీనివాసరావు, ఎస్ కె చాన్ భాష, ఆరవ భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా డ్రెయిన్

నరసాపురం: పట్టణంలో రాజరాజేశ్వరి థియేటర్‌కు వెళ్లే దారిలో మలుపులో ఉన్న డ్రెయిన్ ప్రమాదకరంగా ఉంది. డ్రెయిన్‌పై మూతలు సవ్యంగా లేవు. సరిగ్గా మలుపులో గొయ్యి పడడంతో అటుగా వెళ్లేవారు ప్రమాదాలకు గురవుతున్నారు. ముఖ్యంగా పల్లపు ప్రాంతం కావడంతో వర్షం వస్తే రెండు, మూడు గంటలు వరకూ నీరు నిల్వ ఉండిపోతుంది. ఆ సమయంలో అక్కడ గొయ్యి ఉందనే సంగతి కూడా తెలియడం లేదు. మునిసిపాలిటీ మాత్రం ఈ డ్రెయిన్ అభివృద్ధి విషయంలో ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు.

వదిలేస్తే శిథిలం.. వినియోగిస్తే పదిలం!



భీమవరంలో నిరుపయోగంగా ఉన్న చేపల మార్కెట్ భవనం



భవనం లోపల సౌకర్యాలు



మార్కెట్ బయట అధ్వానంగా షెడ్లులో చేపలు దుకాణాలు

- నిరుపయోగంగా చేపల మార్కెట్ భవనం
- గత ప్రభుత్వంలో రూ.2 కోట్లతో నిర్మించిన భవనం
- 18 నెలలగా నిరుపయోగంగా భవనం
- వినియోగంలోకి తేవాలంటున్న చేపల వ్యాపారులు
- పట్టించుకోని అధికారులు

భీమవరం(ప్రకాశం చౌక్): పట్టణంలో కోట్ల రూపాయలతో నిర్మించిన చేపల మార్కెట్ నిర్వహణ లేమితో నిరుపయోగంగా మారింది. చేపల అమ్మకాలు చేసుకునే వారికి ఎండ, వాన నుంచి రక్షణ ఉండడటానికి అలాగే చేపల విక్రయాలకు అనుకూలంగా సకల సౌకర్యాలతో వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో నేషనల్ ఫిషర్స్ డెవలప్‌మెంట్ బోర్డు సహకారంతో రూ.2 కోట్లతో మెంటేవారి తోట అండర్ టన్నెల సమీపంలో ఉన్న మార్కెట్‌లో అధునాతన చేపల మార్కెట్ భవనాన్ని నిర్మించారు. ఈ భవనంలో 45 దుకాణాల వరకు ఏర్పాటు చేసుకొని చేపల విక్రయాలు చేసేలా అన్ని సౌకర్యాలు సమకూర్చారు. అలాగే వ్యాపారాలకు ఇబ్బందులు లేకుండా ఫ్యాన్లు, మంచినీటి సౌకర్యం, మరుగుదొడ్ల సౌకర్యంతో భవనాని నిర్మించడం జరిగింది. కాని ఇప్పటివరకు ఈభవనంలో చేపల విక్రయాలకు వ్యాపారాలకు అప్పగించలేదు.

18 నెలలగా నిరుపయోగంగా భవనం

చేపల మార్కెట్ భవనం 2023 డిసెంబర్‌లో ప్రారంభించారు. తర్వాత ఎన్నికల కోడ్ రావడంతో అధికారులు పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం వచ్చి 14 నెలలు అవుతున్న కూడా ఈ భవనాన్ని పట్టించుకోవడం లేదు. అలాగే అధికారుల నిర్లక్ష్యంగా ఉండడంతో చేపల మార్కెట్ భవనం ఉండి కూడా మార్కెట్‌లో అధ్వానంగా ఉన్న షెడ్లులోనే చేపలు విక్రయిస్తున్నారు. మరి కొందరు గంగానమ్మ గుడి వద్ద యమదుర్రు డ్రెయిన్ గట్టుపై గొడుగుల నీడల్లో చేపల విక్రయాలు చేస్తున్నారు. దీంతో ఎండ, వానకు తడుస్తూ చేపల విక్రయాలకు ఇబ్బందులు పడుతున్నారు. పరిశుభ్రమైన నీళ్ల ఉపయోగించి చేపలు చేసి అందించడం, శుభ్రమైన చేపలు అందించడంలో ఈ భవనం ఏంతో ఉపయోగపడుతుంది. అలాంటి భవనం నిరూపయోగంగా ఉంచడం పట్ల చేపల విక్రయాదారులు అవేదన వ్యక్తం చేస్తున్నారు. భవనంలోనే దుకాణాలు ఏర్పాటు చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని చేపల విక్రయించే మహిళలు కోరుతున్నారు.

ఏ శాఖకు చెందుతుంది

ఈ భవనం గాని, భవన నిర్వహణ ఏ శాఖలోకి వస్తుందో సరైన అవగహన అటు మత్స్యశాఖ ఇటు మున్సిపల్ శాఖ అధికారులకు తెలియడం లేదు. దాంతో ఈరెండు శాఖల అధికారులు ఈ భవనం గురించి పట్టించుకోవడం లేదు. రూ.2 కోట్లతో నిర్మించిన భవనం పరిస్థితిపై అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదు. చేపల మార్కెట్ భవనం గురించి మాకు ఎందుకని మున్సిపల్ అధికారులు, భవనం కట్టించడం మా శాఖ ద్వారా జరిగింది దాని నిర్వహణ మున్సిపాలిటి అధికారులకు సంబంధం అన్నట్లు మత్స్య శాఖ అధికారులు తమకెందులే అని వదలివేశారు.

కలెక్టర్ పట్టించుకోవాలి

జిల్లా కేంద్రమైన భీమవరంలో ప్రజాధనం రూ.2 కోట్లతో నిర్మించిన భవనం నిరుపయోగంగా ఉండడంపై జిల్లా కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించాలి. నిరూపయోగంగా ఉన్న భవనాన్ని వెంటనే అందుబాటులోకి తీసుకువచ్చి భవనంలో చేపల వ్యాపారాలకు అవకాశం కల్పించే చర్యలు తీసుకొవాలి. భవనాన్ని అలాగే వదిలివేస్తే నిర్వహణ లేక లోపల లోపల సౌకర్యాలు దెబ్బతినడం, భవనం దెబ్బతినే పరిస్థితి కూడా వస్తుంది.

చేపల విక్రయాలకు అవకాశం కల్పించాలి



అన్ని సౌకర్యాలతో నిర్మించిన చేపల మార్కెట్ భవనాన్ని వినియోగంలోకి తీసుకురావాలి. భవనంలో చేపలు విక్రయిస్తే బహిరంగ ప్రదేశాల్లో చేపల విక్రయాలు తగ్గి పరిశుభ్రమైన వాతావరణం ఏర్పడుతుంది. బయట షెడ్లుల్లో గోడుల నీడల్లో చేపల విక్రయాలకు చాలా ఇబ్బందులు పడుతున్నాము. అధికారులు ఈ భవనం గురించి పట్టించుకోవాలి.

– వీ. పోలమ్మ

ఇబ్బందులు పడుతున్నాం



నూతనంగా కట్టిన భవనం ఉన్నప్పటికి అందులో దుకాణాలు పెట్టడానికి ఇప్పటివరకు అవకాశం లేదు. దాంతో మార్కెట్‌లో అధ్వానంగా ఉన్న షెడ్లులో దుకాణాలు పెట్టుకుని అమ్ముకుంటున్నాం. చాలా ఇబ్బందులు పడుతున్నాం. వర్షం వస్తే అంతా బురదగా ఉంటుంది. దోమలు, పురుగులతో అపరిశుభ్రంగా ఉండడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. మున్సిపల్ అధికారులు కనీసం బ్లీచింగ్ పౌడర్ కూడా చల్లడం లేదు. నూతన భవనంలో చేపల విక్రయాలకు అవకాశం కల్పించాలి.

– ఈ.కాసులమ్మ

బాలా త్రిపుర సుందరి దేవికి వెండి సమర్పణ

భీమవరం (ప్రకాశం చౌక్): పట్టణంలోని మెంటేవారితోటలోని బాలా త్రిపుర సుందరి అమ్మవారి వెండి మకర పీఠానికి శనివారం పట్టణానికి చెందిన కడలి సుబ్రహ్మణ్యం(బాలు) నాగమణి దంపతులు 100 గ్రాముల వెండిని వారి కుమారుడు, కుమార్తె చేతుల మీదగా ఆలయ అభివృద్ధి కమిటీకి అందజేశారు. ఈ సందర్భంగా అమ్మవారికి ఆలయ అర్చకులు కొమ్మశ్రీను ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటి సభ్యులు భక్తులు పాల్గొన్నారు.

నేడు అగ్నిమాపక కేంద్ర భవన నిర్మాణానికి శంకుస్థాపన

భీమవరం: భీమవరంలో జిల్లా అగ్నిమాపక కేంద్రం కార్యాలయ భవన నిర్మాణానికి ఆదివారం శంకుస్థాపన చేస్తున్నట్లు జిల్లా అగ్నిమాపకాధికారి బి శ్రీనివాసరావు చెప్పారు. 15వ ఆర్థిక సంఘం నిధులు రూ. 2 కోట్ల వ్యయంతో ప్రస్తుతం ఉన్న అగ్నిమాపక కేంద్రం ఆవరణలో జిల్లా అగ్నిమాపక కార్యాలయంతోపాటు అగ్నిమాపక కేంద్రం భవన నిర్మాణానికి స్థానిక ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు) శంకుస్థాపన చేస్తారని ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొంటారని శ్రీనివాసరావు చెప్పారు.

నేడు జాతీయవాదం.. రాజ్యాంగ విలువలపై ప్రసంగం

తణుకు అర్బన్: సాంస్కృతిక జాతీయవాదం.. రాజ్యాంగ విలువలు అనే అంశంపై ఆదివారం స్థానిక రోటరీ క్లబ్‌లో ప్రముఖ చరిత్రకారులు, ఉత్తమ శ్రేణి కవి కొప్పర్తి వెంకటరమణమూర్తి ప్రసంగిస్తారని తణుకు స్టడీ సర్కిల్ అధ్యక్షుడు డాక్టర్ భూపతిరాజు రమేష్‌చంద్రబాబు, సామాజిక న్యాయ పోరాట సమితి అధ్యక్షుడు పేరూరి మురళీకుమార్ తెలిపారు. సాయంత్రం 4 గంటలకు డీవీ వీఎస్‌వర్మఅధ్యక్షతన నిర్వహించనున్నట్లు తెలిపారు.

క్విజ్ పోటీల్లో ఆర్ఆర్‌డీఎస్ విద్యార్థుల ప్రతిభ



భీమవరం ఆర్ఆర్‌డీఎస్ కళాశాలలో విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

భీమవరం: సమాచార హక్కు చట్టంపై తణుకులో విద్యార్థులకు నిర్వహించిన క్విజ్ పోటీల్లో భీమవరం ఆర్ఆర్‌డీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ద్వితీయస్థానం సాధించినట్లు కళాశాల ప్రిన్సిపల్ వీకేజే ప్రసూన తెలిపారు. విజేతలను శనివారం కళాశాలలో అభినందించిన సందర్భంగా ఆమె వివరాలను తెలిపారు. సమాచార హక్కు చట్టం ద్విశతాబ్ది ఉత్సవాల్లో భాగంగా చట్టంపై విద్యార్థులకు అవగాహన కల్పించడానికి తణుకు డిగ్రీ కళాశాల నోడల్ రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో ఎన్ఆర్‌సీ స్థాయిలో పోటీలు నిర్వహించినట్లు చెప్పారు. పోటీల్లో ఆర్ఆర్‌డీఎస్ డిగ్రీ కళాశాల తరపున బీఏ తృతీయ సంవత్సరం విద్యార్థులు డి అశ్విని, డి సాయితేజస్విని, టి ప్రశాంతకుమారి పాల్గొని 78 పాయింట్స్ సాధించిన ద్వితీయస్థానంలో నిలిచారన్నారు. ఈ కార్యక్రమంలో ఐక్యూఏసీ కోఆర్డినేటర్ పి అరవిందస్వామి, ఎస్ లక్ష్మీకాంతం, ఉమామహేశ్వరి, సత్యనారాయణ, ఎల్ నర్సింహరావు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై యువత అప్రమత్తంగా ఉండాలి



భీమవరం ఎస్ఆర్‌కేఆర్ కళాశాలలో మాట్లాడుతున్న సీఐ కాళీచరణ్

భీమవరం: సైబర్ క్రైమ్ నేరాల పై యువత, మేధావులు కూడా అప్రమేత్తంగా ఉండాలని భీమవరం టూటౌన్ సీఐ జి కాళీచరణ్ అన్నారు. భీమవరం ఎస్ఆర్‌కెఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం మెకానికల్ ఇంజనీరింగ్ విద్యార్థులకు సైబర్ క్రైమ్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. సైబర్ క్రైమ్ నేరాలకు మేధావులు, విద్యార్థులు సైతం బలైపోతున్నారని అందువల్లనే విస్తృతస్థాయిలో సైబర్ క్రైమ్ పట్ల అవగాహన కల్పించడానికి ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రధానంగా సెల్ ఫోన్స్‌కు తెలియని నెంబర్ నుంచి వచ్చే ఎటువంటి ఫోన్‌కాల్స్‌ను స్పందించవద్దన్నారు. విద్యార్థులు, యువత డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. విద్యార్థినిలకు ఏదైనా ఇబ్బంది వస్తే శక్తియాప్ ద్వారా పోలీస్ సహాయం పొందవచ్చనన్నారు. కళాశాల ప్రిన్సిపల్ కె వి మురళీకృష్ణరాజు మాట్లాడుతూ పోలీసులు అనుభవ పూర్వకంగా చెప్పే అంశాలను విద్యార్థులు గమనించి భవిష్యత్తులో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో టూటౌన్ ఎస్ఐ కె రామారావు, కళాశాల మెకానికల్ ఇంజనీరింగ్ హెడ్ కె సీతారామరాజు, అల్లు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నాడీ సంబంధిత వ్యాధులపై అవగాహన



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఆచార్య డాక్టర్ అనిల్

పెనుగొండ: ప్రస్తుత సమాజంలో చాలా మంది నాడీ సంబంధిత వ్యాధులతో ఇబ్బందులు పడుతున్నార ని తమిళనాడు సాయి యూనివర్శిటీ ఆచార్య డాక్టర్ అనిల్ అన్నమనీడి అన్నా రు. పెనుగొండ ఎస్వీకేపీ అండ్ డాక్టర్ కేఎస్ రాజు కళాశాలలో లైఫ్‌సైన్స్ విభాగం, బయోటెక్నాలజీ, బయో కెమిస్ట్రీ, జువాలజీ, బోటనీ విభాగాల్లో ఏర్పాటు చేసిన నాడీ సంబంధిత వ్యాధులపై సమాచార బదిలీ ప్రోటీన్ల పాత్రపై అవగాహన సదస్సు నిర్వహించారు. నాడీ సంబంధిత వ్యాధులు అల్జీమర్స్, పార్కికిన్, నస్స్ వ్యాధులతో మాత్రమే కాకుండా, నాడులను దెబ్బతీసే ప్రమాదకరమైన వ్యాధులు ఇంకా చాలా ఉన్నాయన్నారు. వాటిని సమాచార బదిలీ ప్రోటీన్ల ద్వారా కొంతవరకూ అదుపు చేయవచ్చునన్నారు. జర్మనీలో తాను చేసిన పరిశోధనలో భాగంగా బసూన్ ప్రోటీన్ పని చేసే విధానాన్ని వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వైవీవీ అప్పారావు మాట్లాడుతూ నేటి తరానికి నాడీ సంబంధిత వ్యాధులపై అవగాహన చాలా అవసరమన్నారు. కార్యక్రమంలో బయోటెక్నాలజీ విభాగాధిపతి టి.రమేష్, బయో కెమిస్ట్రీ అధ్యాపకుడు టి.దివాకర్, జువాలజీ విభాగాధిపతి డాక్టర్ కె.లక్ష్మీకాంతమ్మ, బోటనీ విభాగాధిపతి డాక్టర్ కె.శ్రీలక్ష్మీ, పీజీ జువాలజీ అధ్యాపకులు రమణి, జెసిల్ల జాయ్, మిరియాల శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ



విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను అందజేస్తున్న దృశ్యం

యలమంచిలి: మండలంలోని కాజ తూర్పు గ్రామంలోని పింగళి వెంకయ్య జిల్లా పరిషత్ ఓరియంటల్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థి, సాఫ్ట్ వేర్ ఉద్యోగి కడలి శేఖర్ రూ. 50 వేలతో పాఠశాలకు రంగులు వేయించడంతో పాటు 8వ తరగతి విద్యార్థులు 14 మందికి పోటీ పరీక్షల స్టడీ మెటీరియల్‌ను శనివారం అందించారు. ప్రస్తుతం పాఠశాలలో ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న తమ పూర్వ ఉపాధ్యాయుడు పీర్ సాహెబ్ సూచనల మేరకు విద్యార్థులకు మెటీరియల్ అందిచానని శేఖర్ తెలిపారు. ఈ సందర్భంగా శేఖర్‌ను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మహ్మద్ లియాఖత్ అలీ అభినందించారు. గుంపుల నారాయణ ప్రసాద్, వినాయక్ పాల్గొన్నారు.

ఆడియో, వీడియో అసోసియేషన్ సమావేశం

పాలకొల్లు సెంట్రల్: రోజురోజుకూ పెరుగుతున్న టెక్నాలజీతో టెక్నీషియన్లు అందరూ అడ్వాన్స్ ట్రైనింగ్ తరగతులకు సమయం కేటాయించాలని ఆడియో, వీడియో అసోసియేషన్ అధ్యక్షుడు మానెం బసవరాజు అన్నారు. శనివారం స్థానిక వీవర్స్ కాలనీలో మహిళా మండలి విజ్ఞాన భవనంలో అసోసియేషన్ సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా టెక్నీషియన్ల పలు సమస్యలను నివృత్తి చేశారు. అవగాహన కల్పించారు. అనంతరం సభ్యులకు సభ్యత్వ పత్రాలను అందజేశారు. ఈకార్యక్రమంలో వట్టి శ్రీనివాస్, బత్తుల నాగేశ్వరరావు, నంబూరి పుల్లయ్య, యు.అప్పాజీ, బండి కృష్ణ,కేతా శంకర్ తదితరులు సభ్యులు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగులపై పీ4 ఒత్తిడి

- భీమవరంలో రీ సర్వే వేగంగా చేయడం లేదని 26 మందికి నోటీసులు
- మార్గదర్శకులను కూడా వెతికిపట్టుకోవాలని ఒత్తిడి
- పింఛన్ల పంపిణీ సర్వేతో సతమతం

భీమవరం(ప్రకాశం చౌక్): సచివాలయంలో ఉద్యోగుల నెత్తిపై పీ 4 సర్వే అన్నట్లుగా భారం మోస్తున్నారు. జిల్లా కేంద్రమైన భీమవరంలో పీ4 రీ సర్వేతో సచివాలయం ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారు. రీ సర్వే వేగంగా చేయడం లేదని పట్టణంలో 26 మంది సచివాలయం ఉద్యోగులకు మున్సిపల్ కమిషనర్ షోకాజ్ నోటిసులు జారీ చేశారు. ఒక పక్క పింఛన్ల పంపిణీ, మరొ పక్క పీ4 సర్వే సచివాలయం సాధారణ ఉద్యోగ పనులతో సర్వే ఆలస్యమవుతుంది. ఈ నేపథ్యంలో ఈసోకాజ్ నోటిసులతో సచివాలయం ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. పీ4 యాప్ పింఛన్ల పంపిణీ ముందు రోజుల్లో సర్వర్ సమస్య, యాప్ మార్పులు చెర్పులతో సక్రమంగా పనిచేయలేదు. యాప్ పని చేయకపోయిన సచియాలయం ఉద్యోగులపై సర్వే ఒత్తిడి చేయడం ఆలస్యమవుతుందని నోటిసులు ఇవ్వడంపై అవేదన గురువుతున్నారు.

మార్గదర్శకులు వెతికాలని ఒత్తిడి:

పీ4 రీ సర్వే చేస్తున్న సచివాలయం ఉద్యోగులే మార్గదర్శకులు(సాయం చేసేవారు) వెతికాలని ఒత్తిడి ఉంది. అయితే వార్డుల్లో గుర్తించిన బంగారు కుటుంబాలకు ఆర్థిక సాయానికి కూటమి నాయకులు ముందుకు రావడం లేదు. ఆర్థిక సాయం చేస్తే అది ఏవిధంగా లబ్ధిదారులకు అందించడంపై సరైన సమాచారం లేక ముందుకు రావడం లేదు. ఇక పీ4 సాయం మా వల్ల కాదు అన్నట్లు వ్యవహరిస్తున్నారు. ఈ విషయం పట్టించుకొని అధికారులు మార్గదర్శకులను చూడాలని రిజిస్ట్రార్ చేయాలని సచివాలయం ఉద్యోగులపై ఒత్తిడి తెస్తున్నారు.

గొప్ప నటుడు బళ్లారి రాఘవ



రాఘవ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశం చౌక్): గొప్పనటుడు బళ్లారి రాఘవ అని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బి.శివన్నారాయణరెడ్డి పేర్కొన్నారు. భీమవరం కలెక్టరేట్ పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో బళ్లారి రాఘవ జయంతి కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాఘవ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డిప్యూటీ కలెక్టర్ శివన్నారాయణరెడ్డి మాట్లాడుతూ రాఘవ నాటక రంగంలో సంచలనాలు సృష్టించి సినిమా రంగం వైపు వెళ్లిన గొప్పనటుడన్నారు. తొలితరం కథానాయకుల్లో రాఘవ ఒకరని తెలిపారు. కళా రంగానికి ఆయన చేసిన సేవలకు గుర్తింపుగా 1981లో తపాలా బిళ్లను విడుదల చేశారని, మొట్ట మొదటిసారిగా తెలుగు సినీ పరిశ్రమకు బళ్లారి నుంచి బళ్లారి రాఘవకు ఈ గౌరవం దక్కిందని తెలిపారు. విశాల ఆలోచనాలు అనంత భావాలు జాతి ప్రగతికి, మూఢాచారాల నిర్మూలనకు నాటకరంగం ప్రధాన సాధనమని భావించి నాటకరంగం అభివృద్ధికి రాఘవ ఎనలేని కృషిచేశారని వివరించారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ల్యాండ్ సూపరింటెండెంట్ సీహెచ్ రవికుమార్, ఏవో చంద్రశేఖర్, టీడీలు, సూర్యనారాయణ, మద్రాపు సన్యాసిరావు, సూర్యనారాయణరాజు, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

రైస్‌మిల్లు కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



రైస్‌మిల్లు కార్మికుల మహాసభలో మాట్లాడుతున్న వాసుదేవరావు

భీమవరం: రైస్‌మిల్లు కార్మికులకు కనీస వేతన చట్టం సవరించి నెలకు రూ.26 వేలు జీతం ఇవ్వాలని భీమవరం తాలూకా రైస్ మిల్ వర్కర్స్ యూనియన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. శనివారం భీమవరం తాలూకా రైస్ మిల్ వర్కర్స్ యూనియన్ 32వ జిల్లా మహాసభ స్థానిక ఛాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో సత్యనారాయణ అధ్యక్షతన జరిగింది. ఈసందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బి వాసుదేవరావు మాట్లాడుతూ మూడు పంటలు పుష్కలంగా పండే డెల్టా ప్రాంతాన్ని ఆక్వా చెరువులు తవ్వకంతో రైస్‌మిల్లు కార్మికుల పరిస్థితులు దుర్భరంగా మారాయని, ప్రభుత్వ నూతన విధానాల వల్ల రైస్ మిల్ కార్మికుల పని భద్రత లేకుండా పోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. పరిశ్రమల్లో సరైన భద్రతా చర్యలు లేకపోవడం వల్ల అనేక ప్రమాదాలు జరుతున్నాయన్నారు. నాలుగు లేబర్ కోడ్ల చట్టాలు తీసుకువచ్చి కార్మికులకు నిలువు దోపిడీ చేస్తున్నారని వీటిని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. అనంతరం భీమవరం తాలూకా రైస్‌మిల్ వర్కర్స్ యూనియన్ నూతన కమిటీ నియమించారు. అధ్యక్ష, కార్యదర్శులుగా బొర్రా శ్రీనివాసరావు, బి వాసుదేవరావు, ఉపాధ్యక్షుడిగా కలిపిండి సత్యనారాయణ, కె సత్యనారాయణ, పింక్ అప్పారావు, సహాయ కార్యదర్శిగా కె తవిటినాయుడు, కె గోపాలరాజు, పోతులసంసోను, కోళ్ల శ్రీనివాసరావు, బాల ఆంజనేయులు, జి ఈశ్వరరావు, జి జనార్దన్‌రావు, టి కృష్ణ ఎంపికయ్యారు.

రైతులకు అండగా ప్రభుత్వం

భీమవరం అర్బన్: రైతులకు అండగా కూటమి ప్రభుత్వం ఉంటుందని భీమవరం ఎమ్మెల్యే ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. భీమవరం మండలంలోని బేతపూడిలో శనివారం ఆయన అన్నదాత సుఖీభవ పథకాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సమస్యలతో వ్యక్తి ఆత్మహత్య

పాలకొల్లు సెంట్రల్: ఆర్థిక సమస్యలతో ఓ వ్యక్తి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. శనివారం రూరల్ పోలీసు లు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని బల్లిపాడు గ్రామానికి చెందిన బి.బంగారం (45) గత కొద్దిరోజులుగా ఆర్థిక సమస్యలతో సతమతమవుతున్నాడు. సమస్యలను తట్టుకోలేక శుక్రవారం రాత్రి ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అతని కుమారుడు చూసి కేకలు వేయగా స్థానికులు వచ్చి హుటాహుటిన భీమవరం ఆసుపత్రికి తరలించారు. వైద్య పరీక్షలు చేసిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ మూర్తి తెలిపారు.

అనారోగ్య బాధితులకు సాయం

పాలకొల్లు సెంట్రల్: గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ముగ్గురు అనారోగ్య బాధితులకు రూ. 30 వేలు ఆర్థిక సహాయం అందించినట్లు వసుధ ఫౌండేషన్ కన్వీనర్ బుద్ధరాజు తెలిపారు. శనివారం ఫౌండేషన్ చైర్మన్ మంతెన వెంకట్రామరాజు అందించిన ఆర్థిక సహాయాన్ని బాధితులకు రూ. 10 వేలు చొప్పున అందజేశారు.